ప్రజాశక్తి
బుధవారం 16 అక్టోబర్ 2024
5
పార్వతీపురం మన్యం

జిల్లా ఇంఛార్జి మంత్రి గా అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా ఇంఛార్జి మంత్రి గా కింజరాపు అచ్చెన్నాయుడును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారి జిల్లాలకు ఇన్‌ఛార్జి మంత్రులను నియమించింది. వ్యవసాయ, సహకార శాఖ మంత్రిగా ఉన్న అచ్చెన్నాయుడు కోనసీమ జిల్లాతో పాటు మన్యం జిల్లాకు కూడా ఇన్‌ఛార్జి మంత్రిగా బాధ్యతలు నిర్వహించనున్నారు. జిల్లాలో జరగనున్న కీలకమైన వ్యవహారాలలో ఇన్‌ఛార్జి మంత్రి కీలక పాత్ర పోషించనున్నారు. జిల్లా మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ ఇంఛార్జి మంత్రిగా జిల్లాలో నిర్వహించబోయే ప్రభుత్వ కార్యకలాపాల్లో భాగస్వామి కానున్నారు.

సిరిమానోత్సవాన్ని తిలకిస్తున్న జనం

అమ్మవారికి పట్టువస్త్రాలు అందజేస్తున్న అశోక్‌గజపతిరాజు, అదితి విజయలక్ష్మి; అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి కొండపల్లి కుటుంబసభ్యులు; పండ్లు, పూలు తీసుకెళ్తున్న మంత్రి సంధ్యారాణి

అంబరాన్నంటిన సిరిమాను సంబరం

అమ్మవారికి కోడిని మొక్కుతున్న మహిళ

- లక్షలాది మంది హాజరు
- పైడితల్లమ్మ దర్శనానికి పోటెత్తిన జనం
- పట్టువస్త్రాలు సమర్పించిన రాష్ట్రమంత్రి కొండపల్లి
- అమ్మవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/ టౌన్, కోట

ఉత్తరాంధ్రులు కల్పవల్లిగా భావించే విజయనగరం పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరం అంబరాన్ని తాకింది. చీకటి పడక ముందే సిరిమానోత్సవాన్ని ముగించాలన్న లక్ష్యాన్ని ఈ ఏడాది అధికార యంత్రాంగం సాధించింది. పోలీసుల ఆంక్షలతో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది జనం తగ్గారు. మంగళవారం సాయంత్రం మధ్యాహ్నం 3.45గంటలకు సిరిమానోత్సవం వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్ సిరిమాను రథాన్ని తాడు లాగి ప్రారంభించారు. సిరిమానుకు ముందు భాగంలో సంప్రదాయ బద్దంగా పాలధార, ఐరావతం, అంజలి రథం, బెస్తవారివల ఒకదాని తరువాత మరొకటి ముందుకు సాగాయి. అమ్మవారి ప్రతిరూపంగా భావించే ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు సిరిమానును అవరోధించారు. అమ్మవారి ఆలయం నుంచి పైడితల్లి అమ్మవారి పుట్టినిల్లు అయిన కోట వద్దకు సిరిమానును మూడుసార్లు ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు పూలు, అరటి పండ్ల విసిరి, కొందరు కోళ్లను చూపి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ అపూర్వ ఘట్టాన్ని లక్షలాదిమంది తిలకించారు. రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు సిరిమాను రథం వెంట ఉండి ఆద్యంతమూ నడిపించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు సిబ్బందికి ఆదేశాలను జారీ చేశారు. ఉత్సవాన్ని సకాలంలో పూర్తి చేయడానికి కృషి చేశారు.

అమ్మవారి సిరిమానోత్సవాన్ని పూసపాటి వంశీయులు, పైడితల్లి ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతి రాజు, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, విశాఖ ఎంపీ భరత్ దంపతులు, మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్ చంద్రదేవ్ దంపతులు, స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఉండి ఎంఎల్ఎ ఆర్.రఘురామ కృష్ణంరాజు తదితర ప్రముఖులు, కీర్తి శేషులు, ఆలయ మాజీ ధర్మకర్త ఆనందగజపతిరాజు సతీమణి సుధా గజపతి, కుమార్తె ఊర్మిళ గజపతి, ఇతర రాజ కుటుంబీకులు ఎప్పటి మాదిరిగానే కోట బురుజు పైనుంచి సిరిమానోత్సవాన్ని వీక్షించారు. రాష్ట్ర శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తమ కుటుంబంతో కలిసి డిసిసిబి కార్యాలయం నుంచి ఉత్సవాన్ని తిలకించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఇతర పోలీసు అధికారులు బందోబస్తు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. పోలీసులు మూడు అంచెల్లో బారికేడ్లను ఏర్పాటు బందోబస్తు నిర్వహించారు.

పైడితల్లి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి కొండపల్లి

అంతకుముందు ఉదయం పైడితల్లి అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆయన కుటుంబ సమేతంగా మంగళవారం ఉదయం అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు అమ్మవారిని దర్శించుకొని పట్టు వస్త్రాలు సమర్పించారు. రాష్ట్ర గిరిజన, స్త్రీ సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, స్థానిక ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి, బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన, ఉండి ఎమ్మెల్యే పి.రఘురామరాజు, శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ చక్రవర్తి, పార్వతీపురం మన్యంజిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ దంపతులు, సినీనటుడు సుమన్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న పులివేషాలు, కత్తిసాము ప్రదర్శన

సిరిమానోత్సవ అనంతరం కోట లోపల పులివేషాలు, కత్తి సాము ప్రదర్శన ఆకట్టుకుంది. వీటిని కేంద్ర మాజీ మంత్రి, మాన్సాస్ సంస్థ చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, రాష్ట్ర విపత్తుల, అగ్నిమాపకశాఖ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్, జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, విశాఖ ఎంపీ భరత్, స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ, రాజేష్ బాబు, టిడిపి నాయకులు వీక్షించారు.

అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ దంపతులు

అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

సిరిమానోత్సవంలో ముందుసాగిన పాలదార

ఐరావతం

అంజలి రథం

, బెస్తవాని వల

అలరించిన పులివేషాలు

ఆదివాసీల కళలను ప్రోత్సాహిస్తాం

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీల అభివృద్ధి సాధనకు కృషి చేస్తూ వారి కళలను ప్రోత్సహిస్తామని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. మండలంలోని నీలకంఠాపురం పంచాయతీలో చింతమానుగూడలో గిరిజన కళాక్షేత్రం, మినీ మ్యూజియంను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన గిరిజనలనుద్దేశించి మాట్లాడుతూ గిరిజన సంస్కృతి పరిరక్షణ, జానపద కళలను ప్రోత్సహించేందుకు అన్ని రకాల ప్రోత్సాహకాలు అందిస్తూ గిరిజన యువత ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు అండగా ఉంటానని తెలిపారు. అనంతరం గిరిజన మ్యూజియంలో ప్రదర్శించిన గిరిజన జీవన విధానాలను, ఆభరణాలు, వేట సాధనాలు, వంటగది ఉపకరణాలు, వనమూలికలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.మన్మధరావు, ఆదివాసీ గిరిజన నాయకులు రామకృష్ణ, చంద్రశేఖర్, నీలకంఠం, కడాయి, రామారావు, పలు స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు పాల్గొన్నారు.

గిరిజన జీవన విధానాలను, వేట సాధనలను పరిశీలిస్తున్న పిఒ

ధరల నియంత్రణలో ఘోర వైఫల్యం : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో టిడిపి కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ధ్వజమెత్తారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో సామాన్య, మధ్యతరగతి ప్రజలు బతకలేని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఎన్నడూ లేని విధంగా నిత్యవసరాల ధరలు పెరిగాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని గొంతు చించుకున్న టిడిపి నాయకులు ఇప్పుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. గడచిన ఎన్నికల్లో కూటమి పార్టీలు ఇచ్చిన హామీ ఏమయ్యాయని ప్రశ్నించారు. అలాగే రాష్ట్రంలో మద్యం, ఇసుక వ్యాపారం ద్వారా దోపిడీ చేయడానికి టిడిపి కూటమి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించుకుందని ఆరోపించారు. ఇటీవల మద్యం షాపుల టెండర్లలో 80శాతం షాపులు టిడిపి నాయకులకే దక్కాయని చెప్పారు. జిల్లాలో ఐటిడిఎల పరిధిలో రెగ్యులర్ గిరిజన సంక్షేమ డిడిలను నియమించలేక పోవడం సిగ్గుచేటన్నారు. ఎలాంటి కారణాలు లేకుండా గిరిజన సంక్షేమ డిడి రుక్మాంగద కృష్ణను సరెండర్ చేయడం అన్యాయమని అన్నారు. తమకు అనుకూలంగా వ్యవహరించే అధికారిని డిడిగా తెచ్చుకునేందుకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. శ్యామలాంబ పండుగ నిర్వహణకు ప్రభుత్వం నుంచి సరిపడే నిధులు తీసుకురావచ్చునని చెప్పారు. ప్రజల నుంచి చందాలు వసూలు చేయాల్సిన అవసరం లేదన్నారు. విలేకరుల సమావేశంలో వైసిపి సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, జెసి ఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్ గొర్లి వెంకటరమణ, పట్టణ నాయకులు బాలాజీ, ఎం.అప్పారావు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు
10న రైతు సంఘం జిల్లా సదస్సు

ప్రజాశక్తి - పార్వతీపురం

వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి రైతుపై ఉందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో రైతు సంఘం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సూర్యనారాయణ మాట్లాడుతూ అన్ని పథకాలకు గ్యారెంటీ ఇస్తున్న ప్రభుత్వాలు రైతుకు, పంటకు మాత్రం గ్యారెంటీ ఇవ్వలేకపోతున్నారని ఇది చాలా దుర్మార్గమని వాపోయారు. విజయవాడ బుడమేరు వరద బాధితుల్లో నష్టపోయిన కౌలు రైతులకు, కూలీలకు ఈరోజు వరకు ఎటువంటి పరిహారం ఇవ్వకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ రైతుల పట్ల చిత్తశుద్ధి లేని ప్రభుత్వాలకు రైతు కష్టాలు కానరావని, భూస్వాముల స్థాయినే అభివృద్ధి కొలమానంగా కొలవడం పాలక ప్రభుత్వాలు చేస్తున్న లోపమని అన్నారు. రైతు పంటకు సరిపడా ప్రాజెక్టులు పూర్తి కాక సాగునీరు లేక, వర్షాభావం, తుఫాన్లు, చీడపీడలు, పండిన పంటకు గిట్టుబాటు ధరలేక, విత్తనం, డీజిల్, పురుగు మందులు, ఎరువులు, నిల్వ చేసుకుని సౌకర్యం లేక ఇలా ఎటుచూసినా రైతులు సుడిగుండంలో చిక్కుకుపోయి అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఈ దుస్థితికి పరిష్కారం కోసం రైతు సంఘం నిరంతరం కృషి చేస్తున్నదని తెలిపారు. అందులో భాగంగా రైతులను చైతన్యపర్చేందుకు నవంబర్ 10న జిల్లా సదస్సు పార్వతీపురంలో నిర్వహిస్తున్నామని, ఈ సదస్సుకు రైతులు, కౌలు రైతులు, రైతు కూలీలు, వ్యవసాయ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మినాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.రాము, రెడ్డి రమణమూర్తి, రెడ్డి ఈశ్వరరావు, పలువురు రైతులు, పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యనారాయణ

గర్భిణుల సురక్షిత ప్రసవమే లక్ష్యం : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - గరుగుబిల్లి/వీరఘట్టం

గర్భిణీల ఆరోగ్యం, సురక్షిత ప్రసవమే లక్ష్యంగా కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయపార్వతి వైద్య సిబ్బందికి సూచించారు. వీరఘట్టం, రావివలస పిహెచ్‌సిలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, ఒపి, మందుల రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులతో ఆసుపత్రికి ప్రతి రోజూ ఎంతమంది వస్తున్నారు, అందజేస్తున్న వైద్య సేవల వివరాలపై ఆరా తీసి క్షేత్ర స్థాయిలో జ్వరాలు, డయేరియా ప్రభావం ఎక్కడైనా ఉందా అని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మందులు, వ్యాక్సిన్ నిల్వల లభ్యతను పరిశీలించి అన్ని పాఠశాలల్లో ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పిహెచ్‌సిల్లో కాన్పు జరిగి వార్డులో ఉన్న తల్లీబిడ్డ ఆరోగ్య స్థితి పరిశీలించారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి ప్రసవం పూర్తయ్యే వరకు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. లేబర్ రూం తనిఖీ చేసి కాన్పుల రిజిస్టర్ పరిశీలించారు. వైద్య, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పని చేసి గర్భిణుల్లో రక్తహీనత నివారణకు కృషి చేయాలన్నారు. పిహెచ్‌సిల్లో పాముకాటు, కుక్క కాటు, ఇతర అత్యవసర చికిత్సకు ప్రాథమికంగా అవసరమైన మందులు, పరీక్షలు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ కీర్తి, డెమో యోగీశ్వరరెడ్డి, ఇఒ జగన్నాథరావు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

దౌర్జన్యంగా తీసుకెళ్లిన యజమాని

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఓ ఇసుక ట్రాక్టకు రెవిన్యూ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. పాచిపెంట మండలం పంచాది గెడ్డ నుంచి ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ గురించి సమాచారం అందడంతో ఆర్ఐ మౌలాలీ దారి కాచి పట్టుకున్నారు. వెంటనే ఆ ట్రాక్టర్‌ను తహశీల్దార్ కార్యాలయానికి తీసుకొచ్చారు. కొద్ది సేపటి తరువాత ట్రాక్టర్ యజమాని వచ్చి అక్కడే నిర్మాణంలో వున్న అన్నా క్యాంటీన్‌కు ఇసుక వేశామని చెప్పి అక్కడ ఇసుక అన్ లోడ్ చేసి దర్జాగా ట్రాక్టర్‌ను తీసుకుని పోయాడు. ఆ ట్రాక్టర్ సీజ్ బుక్, తాళాలు రెవెన్యూ అధికారులు తీసుకున్నా ఇంకో తాళంతో దౌర్జన్యంగా తీసుకెళ్లాడు. తహశీల్దార్ స్వాధీనంలో ఉన్న ట్రాక్టర్‌ను దౌర్జన్యంగా తీసుకెళ్లిన యజమాని టిడిపి నాయకుడని తెలుస్తోంది. దీనిపై తహశీల్దార్ ఎస్వీ రమణను వివరణ కోరగా ట్రాక్టర్‌ను సీజ్ చేశామని, తమ అధీనంలో ఉందని కేసు నమోదు చేసి కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు.

పక్కాగా రీసర్వే చేపట్టాలి : జెసి

ప్రజాశక్తి - సీతానగం

జిల్లాలో రీసర్వే పక్కాగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండలంలోని వెన్నెలబచ్చెంపేటలో రీ సర్వే కోసం నిర్వహించిన గ్రామసభను మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. రెవెన్యూ అధికారులకు ఈ సందర్భంగా పలు సూచనలు, మార్గదర్శకాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల ప్రకారం భూహక్కుదారి పేర్లు సరిపోయినది లేనిదీ సరిచూసుకోవాలన్నారు. భూ యజమానులకు చెందిన సర్వే నెంబరుల్లోని విస్తీర్ణం వివరాలు భూహక్కుదారులతో పాటు పక్క రైతులను అడిగి తెలుసుకోవాలన్నారు. రెవెన్యూ రికార్డుల్లో గాని, రైతుల పాసు పుస్తకాల్లో తప్పులున్నట్లయితే వాటిని సరిచేయాలని సూచించారు. అన్ని సక్రమంగా ఉన్నట్లు నిర్ధారణ అయిన పిదప వాటిని నిర్ధారించాలని జేసీ పేర్కొన్నారు. ఈ క్రమంలో పలువురు రైతులు అందజేసిన దరఖాస్తులను ఆమె స్వీకరించారు. ఈ పర్యటనలో మండల, రెవెన్యూ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి : సిపిఎం

18న సబ్‌స్టేషన్ల వద్ద ధర్నా

ప్రజాశక్తి - సీతంపేట

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, ప్రజలపై భారాలు పెంచే స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న జిల్లాలోని అన్ని మండల విద్యుత్ కార్యాలయాల (సబ్ స్టేషన్) వద్ద ధర్నాలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యవసర వస్తువుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేని విధంగా ఆకాశాన్నంటాయన్నారు. ప్రజలపై ఆర్థికభారం పెరుగుతుందన్నారు. వీటిని అదుపు చేసే పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదని విమర్శించారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూనే ట్రూఅప్ ఛార్జీల పేరుతో గత రెండేళ్ల నుంచి రూ.20 వేల కోట్లు భారాన్ని ప్రజలపై వేయడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ట్రూఅప్ ఛార్జీల పద్ధతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గత ఏప్రిల్ నుంచి ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో నెలకు రూ.600 బిల్లు ఉన్న వారికి రూ.1000, రూ.1200 పెరిగిన బిల్లులు వస్తున్నాయని అన్నారు. అలాగే గతంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి టిడిపి ప్రభుత్వం అదే కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకొని స్మార్ట్ మీటర్‌ను విశాఖ వంటి పట్టణాల్లో అమలు చేస్తుందన్నారు. ఫోన్ రీఛార్జిలాగే ముందుగా బిల్లులు కట్టాలని ఒత్తిడి పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన ఈ ట్రూఅప్ ఛార్జీలను ఉపసంహరించుకుంటూ రెగ్యులేటరీ కమిషన్‌కు తెలియజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ చార్జీల పెంనెరకు వ్యతిరేకంగా ఈనెల 18న అన్ని విద్యుత సబ్‌స్టేషన్లవద్ద ధర్నాలు నిర్వహించాలని వేణు పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, నాయకులు డి.రమణారావు, జె.శ్రీరాములు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

పడకేసిన మున్సిపల్ పాలన

- బదిలీపై వెళ్లిన కమిషనర్
- కొత్త కమిషనర్ రాక అనుమానమే
- కీలక పోస్టులు ఖాళీ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపాల్టీలో కమిషనర్‌తో పాటు కీలక అధికారుల పోస్టులు ఖాళీగా ఉండడం పట్టణంలో పాలన పడకేసింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బదిలీ ప్రక్రియలో భాగంగా స్థానిక కమిషనర్ బదిలీపై ఈ నెల 4న అమరావతిలో గల సచివాలయానికి వెళ్లిపోయారు. ఆయన స్థానంలో శ్రీకాకుళం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలో పనిచేస్తూ పార్వతీపురం మున్సిపాలిటీకి బదిలీపై రావాల్సిన సిహెచ్.శంకర కుమారి నేటికి పదిరోజులు కావస్తున్నా ఇంత వరకూ బాధ్యతలు చేపట్టలేదు. ఇదిలా ఉండగా ఆమె విధులకు హాజరుకాకుండానే కూడా సెలవు పెట్టడం గమనార్హం. మున్సిపల్ కార్యాలయంలో కమిషనరే కీలకమని తెలిసి బదిలీపై రావాల్సిన కమిషనర్ సెలవు పెట్టడంతో వేరొక కమిషనరైనా రప్పించేందుకు స్థానిక ఎమ్మెల్యే విజయ్‌చంద్రతో పాటు, మున్సిపల్ పాలకవర్గం దృష్టి పెట్టకపోవడం పట్ల సర్వత్రా చర్చ జరుగుతోంది. కమిషనర్ లేకపోవడంతో పట్టణంలో జరగాల్సిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందాల్సిన మౌలిక సదుపాయాలు, సేవలు అందడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. అంతేకాక మున్సిపల్ కార్యాలయంలోని కీలకమైన డిఇ, ఎఇ, టిపిఒ వంటి పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.

కమిషనర్ ఎవర్నీ నియమించకపోవడంతో మున్సిపల్ ఎఇగా పని చేస్తున్న సన్యాసిరావు ఇన్చార్జి కమిషనర్ బాధ్యతలు చేపట్టినప్పటికీ అధికారికంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేదు. కమిషనర్‌తో పాటు ఇంజనీరింగ్ విభాగంలో డిఇ, ఎఇ కూడా బదిలీ అయ్యారు. అలాగే టౌన్ ప్లానింగ్ లో టిపిఒకు బదిలీ అయినప్పటికీ ఆయనపై వచ్చిన పలు అభియోగాల వల్ల స్థానిక ఎమ్మెల్యే టిపిఒపై విచారణ చేయాలని కమిషనర్‌ను ఆదేశించడంతో ఆయన్ను బదిలీపై వెళ్లిన కమిషనర్ కె.శ్రీనివాస్ రిలీవ్ చేయలేదు. దీంతో టిపిఒ సెలవుపెట్టి వెళ్లిపోయిన నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ విభాగంలోనూ భవన నిర్మాణ దారులకు అందాల్సిన సేవలు అందడంలేదు.

దీన్ని ఆసరాగా తీసుకుని కార్యాలయంలో పలు విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు కార్యాలయానికి వచ్చామా, వెళ్లామా అన్న చందంగా వ్యవహరిస్తుండడం గమనార్హం. వీరితో పాటు కింద స్థాయి సిబ్బంది పనితీరు పరిస్థితి కూడా అంతంత మాత్రం గానే ఉంది. ఈ కారణంగా పట్టణంలో పలువార్డుల్లో దీర్ఘ కాలంగా ఉన్న సమస్యలు పరిష్కారం కావడం లేదు. పట్టణం అభివృద్ధి జరగాలంటే అధికారుల పర్యవేక్షణ కీలకం. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే విజయ్ చంద్ర దృష్టి సారించి, గ్రేడ్ వన్ మున్సిపాలిటీకి పాలనపై సమస్యల పరిష్కారంపై అనుభవం ఉన్న కమిషనర్‌తో పాటు మిగిలిన పోస్టులను భర్తీ చేసి పట్టణాన్ని అభివృద్ధి పదంలో నడిపించాల్సి బాధ్యత ఎంతైనా ఉంది.

బడిదేవరకొండపై గ్రానైట్ తవ్వకాలకు నిరసనగా వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బడిదేవరకొండను కాపాడుకుందాం

ప్రజాశక్తి - పార్వతీపురం

బడిదేవరకొండ మైనింగ్ తవ్వకాలకు కార్పొరేట్ శక్తులు అనేక ప్రయత్నాలు చేపడుతున్నాయని, పాలక ప్రభుత్వాలు వాటికి వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో బడిదేవరకొండ తవ్వకాలకు వ్యతిరేక గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కష్ణమూర్తి మాట్లాడుతూ బడిదేవరకొండను తవ్వేసి పట్టుకుపోతే వ్యాపారులకు కోట్లలో లాభమని, దీనిపైనే ఆధారపడుతున్న రైతులకు, ప్రజలకు తీవ్ర నష్టం ఎదురవుతుందని, ఇంత జీవనాధారంగా నిలిచిన కొండను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని అన్నారు. మండలంలో పార్టీలకు అతీతంగా ప్రజల, ప్రకృతి, పంటల, శ్రేయస్సు కోసం ప్రజానీకమంతా ఖండించాలని, భవిష్యత్ కార్యక్రమాల పిలుపుల్లో పాలుపంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, గిరిజన సంఘం నాయకులు పి.రాము, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

సీతంపేట : స్థానిక గురుకుల కళాశాలలో మంగళవారం సైబర్ నేరాలపై ఎస్సై వై.అమ్మన్నరావు అవగాహన కల్పించారు. పోక్సో చట్టాలపై బాలికలకు అవగాహన కల్పించారు. బాలికల చట్టాల గురించి తెలుసుకోవాలని చెప్పారు. అవగాహన సదస్సులో ఎఎస్ఐ సంజీవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడును కలిసిన వీరేశ్ చంద్ర దేవ్

ప్రజాశక్తి - కురుపాం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులైన వ్యవసాయ, సహకారశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడ్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్ మంగళవారం శ్రీకాకుళంలోని మంత్రి అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్చార్జి మినిస్టర్‌గా బాధ్యతలు అప్పగించినందుకు కలిసి హృదయపూర్వక అభినందనలు తెలియజేసి నియోజకవర్గ అభివృద్ధికి ఆయన నాయకత్వంలో సూచనలు సలహాలు పాటిస్తూ నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేస్తానని అన్నారు.


అచ్చెన్నాయుడుకు పూల బొకే అందజేస్తున్న వీరేష్‌చంద్రదేవ్

ప్రజాదర్బార్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ అని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండల టిడిపి అధ్యక్షులు అక్కేన మధుసుదనరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించి, పరిశీలించారు. ప్రజల నుంచి అందిన వినతులకు తక్షణ పరిష్కారం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మేజర్ సమస్యలపై తాను ప్రభుత్వంతో మాట్లాడి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చివరి ఆయకట్టు వరకు జంఝావతి నీరు వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు అధ్యాపకులు

జిఒ 114ను అమలు చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వం జిఒ 114ను అమలు చేయాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు మంగళవారం ప్రభుత్వానికి కళాశాల ఆవరణంలో వేడుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గల కాంట్రాక్టు అధ్యాపకుల కోసం ఉద్యోగ క్రమబద్ధీకరణ జరగాలంటే జిఒ 114ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్పందించి జీవోను అమలు చేస్తే తమ ఉద్యోగాలు క్రమబద్ధీకరణ జరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు ఎన్. మురళీకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : జీవో 114 ను పునరుద్ధరించాలని కాంట్రాక్ట్ అధ్యాపకులు డి.రామకృష్ణ, పి.వినోద్ కోరారు. మంగళవారం రాష్ట్రవ్యాప రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు అధ్యాపకుల యాక్ట్ 30, జీవో 114ను పునరుద్ధరించాలని కోరారు. కాంటాక్ట్ లెక్చరర్లను కొనసాగించాలని కోరుతూ పసుపు జెండాలకు పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ లెక్చరర్లు పాల్గొన్నారు.

పరుగు పందెంలో పైడిరాజుకు కాంస్య పతకం

ప్రజాశక్తి - సాలూరురూరల్


కాంస్యపతకం సాధించిన పైడిరాజు (చివర)

మండలంలోని మొఖాసా మామిడిపల్లికి చెందిన కనకల పైడిరాజు ఈనెల 10 నుంచి 19 వరకు మలేషియాలో జరుగుతున్న అథ్లెటిక్స్ పోటీల్లో 800 మీటర్ల రన్నింగ్‌లో కాంస్య పతకం సాధించినట్లు ఆమె గురువు పొట్నూరు శ్రీరాములు తెలిపారు. 36వ మలేషియా ఇంటర్నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ఇండియా తరుపున పాల్గొన్న పైడిరాజు భారతదేశానికి 800 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించడం ఆనందంగా ఉందని శ్రీరాములు తెలిపారు. పైడిరాజు ఇంతకుముందు శ్రీలంకలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో వెండి పతకం సాధించిందన్నారు. ఆమె గెలుపునకు స్నేహితులు, క్రీడాకారులు గ్రామస్తులు ఆనందం హర్షం వ్యక్తం చేశారు.

వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - బలిజిపేట

పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని ఎంఇఒ-1 సామల సింహాచలం అన్నారు. మంగళ వారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. తరగతి గదులకు వెళ్లి ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. విద్యార్థులు ఎంతవరకు అవగాహన చేసుకున్నదీ పలు ప్రశ్నలు వేసి సమాధానాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారు ప్రగతి సాధించేలా ప్రతి సబ్జెక్ట్ ఉపాధ్యాయుడు తగిన ప్రణాళికతో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. టీచర్ డైరీ, పాఠ్య ప్రణాళికలు అకడమిక్ కేలండర్ ప్రకారం సిద్ధం చేసుకుని, వాటిని తరగతి గదిలో అమలు చేయాలని టీచర్లకు మార్గ నిర్దేశనం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ ఎం.పైడపునాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు గిరిజన విద్యార్థులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం

మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులు 68వ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ అండర్-14 (బాయ్స్, గర్ల్స్) పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ ఎన్.మాధవ రావు తెలిపారు. ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న నిమ్మల జితేంద్ర, ఆరిక చరణ్, ఆరిక చందు, మండంగి అఖిల్, చంద్రదేవ్ ఈనెల 17 నుంచి 19 వరకు నంద్యాలలో డిఎస్ఎ స్టేడియం పద్మావతి నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయులు నాగరాజు, డిప్యూటీ వార్డెన్ రమేష్ అభినందించారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి - సీతానగరం

ప్రజలకు మెరుగైన వైద్యమందించాలని ఎంపిపి బి.రమణమ్మ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అన్ని రకాల వ్యాధులకు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా వైద్యులు, సిబ్బంది ఉండాలని ఆమె చెప్పారు. కార్యక్రమంలో పెదబోగిలి సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ, వైద్యాధికారులు పి.ఉషారాణి, సిహెచ్ఒ ఎస్‌వి వెంకటరమణ, యుడిసి పి.మురళి, సభ్యులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే డెంగీ నిర్మూలన

ప్రజాశక్తి - కురుపాం

పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీ వ్యాధిని అరికట్టగలమని జిల్లా సహాయ మలేరియాధికారి సూర్యనారాయణ అన్నారు. మంగళవారం కురుపాంలో ఇటీవల డెంగీకి గురైన భార్గవ్, మేఘన, నందిని ఇళ్లకు జిల్లా కన్సల్టెంట్ రామచంద్రతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. మనం నివసిస్తున్న ఇంటి ఆవరణలో ఎలాంటి నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, అప్పుడే మలేరియా, డెంగీ వంటి జ్వరాలకు దూరంగా ఉండగలమని అన్నారు. అనంతరం క్షేత్రస్థాయి సిబ్బందితో మాట్లాడుతూ గృహ సందర్శనలో తటస్థపడిన ప్రతి కేసును ఆన్లైన్‌లో అప్లోడ్ చేసి తగిన చికిత్సను అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ పర్యవేక్షకులు కె.రాధాకృష్ణ, ఎంటిఎస్ ఆదినారాయణ, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి సిద్ధం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -సీతానగరం

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తమప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు. మండలంలోని నిడగల్లులో పల్లె పండగ కార్యక్రమానికి హాజరై ఎమ్మెల్యే రోడ్డు పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పల్లె పండగ కార్యక్రమాన్ని అమలు చేసి ఆ గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పనకు పెద్దపీట వేస్తున్నామ న్నారు. ప్రతి గ్రామాన్ని అభివద్ధి చేసి మహిళలు ఆర్థికంగా ఎదిగేలా చూస్తామని, అందుకు తగ్గ పథకాలు అందుబాటులో సక్రమంగా అమలయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.అరుద్రమ్మ, మాజీ సర్పంచులు గాజాపు మంగమ్మ, తాతబాబు, టిడిపి మండల కార్యదర్శులు సత్యంనాయుడు వేణుగోపాల నాయుడు, జిల్లా నాయకులు జి.వెంకటనాయుడు, జనసేన నాయకులు శ్రీనివాసరావు, వెంకట రమణ, ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు, తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఎపిఒ పి.భాను, ఎంఇఒ జి.సూర్య దేముడు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్: మండలంలోని వెంకటరాయుడుపేటలో పల్లె పండగ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ గ్రామానికి ప్రాధాన్యనిస్తూ అభివద్ధి బాటలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. తాగు నీరు, రహదారి సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పిస్తాన న్నారు. అన్నారు. మెడికల్ కళాశాల, పార్వతీపురానికి బైపాస్ రోడ్డు నిర్మాణానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని శివ్వాంలో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా శివ్వాం నుంచి నాగావళి నది వరకు రూ.3 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రహదారి నిర్మాణ పనులను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 20 వరకు శంకుస్థాపన చేస్తున్న పనులకు సంబంధించి సంక్రాంతి లోగా పనులు పూర్తయ్యేలా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించారు. పల్లె పండుగ కార్యక్రమంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.పైడితల్లి, మండల టిడిపి అధ్యక్షులు అక్కేన మధుసూదనరావు, మాజీ ఎంపిపి ద్వారపురెడ్డి ధనంజయరావు, పలువురు నాయకుల, కార్యకర్తలు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న ఇందిర

గిరిజన చట్టాలను పగడ్బందీగా అమలు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన చట్టాలను పగడ్బందీగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు వి.ఇందిర డిమాండ్ చేశారు. మండలంలోని పెదశాఖలో బిడ్డిక మధు అధ్యక్షతన సిపిఎం పార్టీశాఖా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఇందిర ఆవిష్కరణ చేశారు. అనంతరం సిపిఎం జాతీయ ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఇందిర మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో నేటికీ విద్య, వైద్యం పూర్తి స్థాయిలో అందని పరిస్థితి ఉందన్నారు. 1/70 చట్టం పూర్తిస్థాయిలో అమలు చేయాలని, జిఒ 3ను పగడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మఠ్రిగోడ పొలాలకు రహదారి కల్పించాలని, మొగగెడ్డపై చెక్ డాం నిర్మించి రైతులు సాగు చేస్తున్న పంట పొలాలకు నీరందించాలని కోరారు. గిరిజనులకు ఇచ్చిన పోడు భూములకు పట్టాలు సరిచేయాలని, ఉపాధి పనులు గతంలో మాదిరిగా కాకుండా పూర్తిస్థాయిలో కల్పించాలని, తదితర సమస్యల పైన తీర్మానం చేశారు. భవిష్యత్తులో ఈ సమస్యల పరిష్కారమయ్యే దిశగా పోరాటం సాగుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కె.సాంబమూర్తి, స్వామినాయుడు, జగన్నాథం, చింతామణి, రభేషు, కైలేష్, రంగారావు పాల్గొన్నారు.

17న మెగా నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వండువ జంక్షన్ వద్ద గల సాయిబాబా జ్ఞాన మందిరంలో ఈనెల 17న మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ఎం.సింహాచలం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖలోని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి వారిచే జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చేవారు ఆరోగ్యశ్రీ కార్డు, బ్యాంక్ అకౌంటు, ఆధార్ కార్డు ఇతర గుర్తింపు కార్డులు , ఫోన్ నెంబర్, తీసుకు రావాలని సూచించారు.

యు.వెంకంపేటలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని యు.వెంకంపేటలో మంగళవారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణీలు, రక్తహీనతలు, రక్తపోటు, తదితర వ్యాధిగ్రస్తులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం సరస్వతి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సీతంపేట

మధ్యాహ్న భోజన కార్మికుల, స్కూల్ శానిటేషన్ వర్కర్ల సమస్యలు తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని, అలాగే వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయం ఆవరణంలో జరిగిన మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం, స్కూల్ శానిటేషన్ వర్కర్ల సమావేశంలో రమణారావు మాట్లాడుతూ బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రమాద బీమా వర్తింప చేయాలని కోరారు. వర్కర్లపై రాజకీయ జోక్యం అరికట్టాలని, కార్మికుల సమస్యలు పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏపి మధ్యాహ్నం భోజనం కార్మిక సంఘం మండలం కార్యదర్శి ఎన్.రొయ్యబారి, వి.చామంతి, ఎం.విలాసవతి, స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు పి.రమాదేవి, బి.రోజామణి, వి.ప్రశాంతి, టి.అంజలి, పి.వరలక్ష్మి, ఎం.సరస్వతి, ఎస్.సంతోషి, పలువురు స్కూల్ స్లీపర్లు, వంట కార్మికులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న మధ్యాహ్న భోజన కార్మికులు, శానిటేషన్ వర్కర్లు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ

ప్రజాశక్తి - కొమరాడ

విద్యార్థులకు ఉచితంగా అందజేసే మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ అన్నారు. మండలంలోని మాదలింగి జెడ్పీ ఉన్నత పాఠశాల నుండి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్ష కోసం సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఎస్.సొసైటీ ఆధ్వర్యంలో యూత్ ఫర్ సేవ సంస్థ సహకారంతో స్టడీ మెటీరియల్స్ మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ మాట్లాడుతూ ప్రతి ఏటా తమ సంస్థ ద్వారా ఎన్ఎంఎంఎస్‌కు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ అందిస్తున్నట్టు తెలిపారు. దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని స్కాలర్‌షిప్‌కు అర్హత పొందాలని సూచించారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ఏడాది కూడా ఎస్ సొసైటీ వారు ఇచ్చిన ప్రోత్సాహంతో ఆరుగురు పిల్లలు స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించారన్నారు. వారి సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పిల్లలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎస్.సొసైటీ ప్రతినిధులు

విద్యార్థుల అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - కురుపాం

నిర్దిష్ట అసభ్య వైకల్యాలపై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఇఆర్‌టి ఎం.గౌరీశ్వరి మాట్లాడుతూ మండల విద్యాశాఖ అధికారుల ఆదేశం మేరకు నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి పిల్లల్లో పురోభివృద్ధిని పెంచడానికి ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేసిన హెచ్‌సి కృష్ణమూర్తి

విత్తన కంపెనీల పట్ల రైతులు అప్రమత్తం : ఎడిఎ

ప్రజాశక్తి - పాచిపెంట

విత్తనాన్ని ఎంపిక చేసుకునేటప్పుడు అలాగే వివిధ కంపెనీల విత్తనాలను విత్తన ఉత్పత్తి కోసం వేసేటప్పుడు రైతుల ఒప్పంద విషయంలో జాగ్రత్తగా ఉండాలని, అన్ని రకాల డాక్యుమెంట్లను భద్రపరచుకోవాలని సాలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.మధుసూదన్‌రావు అన్నారు. మండలంలోని పాంచాలి, తాడూరులో జరిగే పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతూ రైతులు విత్తనాలు, పురుగు మందులు కొనేటప్పుడు రసీదును తప్పక తీసుకోవాలని సూచించారు. సాగు ఖర్చులు దిగుబడులు పెంచే దిశగా ఆలోచనలు చేయాలని యూరియాతో వేపనూనె కలిపి చల్లుకుంటే యూరియా పనితనం పెరగడమే కాకుండా చీడపీడల ఉధతి తగ్గుతుందన్నారు. అలాగే మొక్కజొన్న పంటలు మొదటిసారిగా పిచికారి తప్పనిసరిగా వేప నూనెతోనే మొదలు పెట్టాలని సూచించారు పాంచాలి గ్రామ సర్పంచ్ గూడెపు యుగంధర్ మాట్లాడుతూ రైతులు తమ సొంత అవసరాల కోసమైనా సరే ప్రకృతి వ్యవసాయాన్ని చేయాలన్నారు. అలాగే రబీ పంటకు కావాల్సిన ఎరువులు ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఒ కె.తిరుపతిరావు ఎంపిటిసి సభ్యులు ఉమామహేశ్వరరావు, విఎఎలు, ప్రకృతి సేద్యం ఎల్‌వన్‌లు, రైతులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని మండలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ సి హెచ్ ప్రసాద్ రావు ప్రకృతి వ్యవసాయ పంటలపై రైతులకు అవగాహనా కల్పించారు. పంటలు వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువుల వాడకం వంటి అంశాలపై వివరించారు. చీడపీడ నివారణకు రైతులతో కాషాయాలు తయారు చేయించారు. కార్యక్రమంలో వ్యవసాయ, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

సీతానగరం : మండలంలోని నిడగల్లు, బూర్జలో పొలంపిలుస్తుందని కార్యక్రమం మంగళవారం మండల వ్యవసాయ అధికారి అవినాష్ ఆధ్వర్యాన జరిగింది. కార్యక్రమంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో జరిగిన ఇ పంట నమోదు జాబితాను రైతులకు చదివి వినిపించారు. ఇ పంట నమోదులో రైతులు ఏఏ పంటలు వేశారు, ఎంత విస్తీర్ణంలో వేశారు ఆధార్ నెంబర్ సరిపోయిందా లేదా, అలాగే రైతు సాగు చేస్తే సాగుదారు వివరాలు నమోదు అయ్యాయా, లేదా అన్ని సరిపోయాయా ఏమైనా మార్పులుంటే గ్రామసభల ద్వారా సరిచేసుకోవాలని తెలిపారు. అలాగే రబీ సాగుకు కావాల్సిన విత్తనాలు ముందుగానే తెలియచేస్తే వెంటేనే వాటిని ఎపి సీడ్స్ వారి ద్వారా ఏర్పాటు చేస్తామని తెలిపారు. మినుములు, పెసలతో పాటు వేరుశెనగ, వరి, ఉలవలు విత్తనాలు కూడా సబ్సిడీపై అందించే ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇ-పంట జాబితాలు అన్ని గ్రామాల్లో రైతులకు చదివి విఎఎలు తెలియజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లు ఎంపీటీసీ లు ఏపీసీఎన్ఫ్ స్టాఫ్ రైతులు పాల్గొన్నారు.

బలిజిపేట : ఇ- పంటలో నమోదైన పంటల వివరాలను విధిగా రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించాలని, గ్రామ సభలు నిర్వహించి వివరాలను చదివి రైతులకు వినిపించాలని మండల వ్యవసాయ అధికారి యమ్ శ్రావణ్ కుమార్ నాయుడు తెలిపారు. బర్లి రైతు సేవ కేంద్రం పరిధిలో గల రామాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు. ఇ- పంట జాబితాను చదివి వినిపించి, బర్లిలో ప్రదర్శించిన ఇ-క్రాప్ ముసాయిదా జాబితాను పరిశీలించిన అనంతరం ఇ-పంట నమోదులో ఏవైనా చిన్న చిన్న తప్పులు దొర్లినట్లయితే సరి చేసుకోవడానికి ఇదే చివరి అవకాశమని అన్నారు. తుది జాబితా అనంతరం ఎలాంటి సవరణలకు అవకాశం లేదని, కావున రైతులందరూ తమ పంటల నమోదు వివరాలను తెలుసుకునేలా అవగాహన కల్పించాలని విఎఎలను ఆదేశించారు. కార్యక్రమంలో విఎఎ వి.చాందిని, సర్పంచ్ గులిపల్లి అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ

ప్రజాశక్తి పార్వతీపురం టౌన్

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ 93వ జయంతిని పురస్కరించుకుని స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా వృద్ధమిత్ర కో-ఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.కృష్ణమూర్తి తన సొంత నిధులతో మంగళవారం పార్వతీపురం మండలం డోకిశిల పంచాయతీ తేలు నాయుడువలస మండల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆంగ్లం, తెలుగు చూసిరాత పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు, మెన్డర్లు ప్రధానోపాధ్యాయులు వీరమల్లు వెంకటరావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని వృద్ధులకు, వికలాంగులకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు అబ్దుల్ కలాం చరిత్రను విద్యార్థులకు తెలియజేస్తూ కృష్ణమూర్తి చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మామిడి శ్రీనివాసరావు, వానపల్లి చంద్రశేఖర్‌రావు, పాఠశాల కమిటీ ఛైర్పర్సన్ రావిపల్లి దేవి, వెంకట్రావు, రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

చెరువులో జారిపడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని అడ్డాపుశిల గ్రామ శివారులో ఉన్న చెరువులో జారిపడి వృద్ధుడు మరణించిన సంఘటన మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన బోసెట్టి వెంకట రమణ (68) కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువుకు చేరుకున్నాడు. పొరపాటున కాలు జారి పడిపోవడంతో మృతి చెందినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ దినకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.